



EVENING EDITION

నేటి దినపత్రిక **సూర్య**

www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
04-08-2025
పేజీలు: 02




## జగదీశ్ రెడ్డి ఓ 'లిల్లిపుట్' అని, కేసీఆర్ లేకపోతే ఆయనెవరని వ్యాఖ్య

బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. జగదీశ్ రెడ్డిని 'లిల్లిపుట్' అంటూ సంబోధించిన కవిత, కేసీఆర్ నీడలో బతికే ఆయనకు సొంత అస్తిత్వం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీనిపై జగదీశ్ రెడ్డి కూడా అంతే స్థాయిలో స్పందిస్తూ సెటైరికల్ కౌంటర్ ఇచ్చారు. కవిత, తనపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేస్తున్న అనుచిత వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్‌లోని కొందరు ముఖ్య నేతల హస్తం ఉందని సంచలన ఆరోపణలు చేశారు. "పార్టీలోని ఒక అగ్రనేత ప్రోద్బలంతోనే నాపై ఇలాంటి వ్యాఖ్యలు చేయిస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ నేతలు ఎవరూ దీనిపై మాట్లాడటం లేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జగదీశ్ రెడ్డిని ఉద్దేశిస్తూ, "కేసీఆర్ అనే నీడ లేకపోతే మీరెవరు నల్గొండ జిల్లాలో పార్టీని నాశనం చేశారు.



## ట్రంప్ గోల్ఫ్ క్లబ్‌వైపు దూసుకొచ్చిన విమానం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గోల్ఫ్ రిసార్ట్ వద్ద భారీ భద్రతా వైఫల్యం బయటపడింది. న్యూజెర్సీలో గోల్ఫ్ క్లబ్ సమీపంలో నోఫ్లైజోన్ ప్రాంతంలోకి ఓ ప్రయాణికుల విమానం దూసుకొచ్చింది. వెంటనే అప్రమత్తమైన ఫైటర్ జెట్స్ రంగంలోకి దిగాయి. ఫాక్స్ న్యూస్ ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం 12:50 గంటల ప్రాంతంలో (స్థానిక కాలమానం ప్రకారం) ఈ ఘటన చోటు చేసుకుంది. బెడ్‌మినిస్టర్‌లోని ట్రంప్ గోల్ఫ్ క్లబ్ సమీపంలో నోఫ్లైజోన్ ప్రాంతంలోకి ప్రయాణికుల విమానం ఒక్కసారిగా దూసుకొచ్చింది. విమానం రాకను గమనించిన ఫైటర్‌జెట్స్ వెంటనే రంగంలోకి దిగి ఆ విమానాన్ని అడ్డుకున్నాయి. ఓ రకమైన జ్వాలతో ప్రయాణికుల విమానం పైలట్‌ను అప్రమత్తం చేశాయి. దాన్ని నోఫ్లై జోన్ నుంచి పంపించేశాయి. ఆ సమయంలో అధ్యక్షుడు ట్రంప్ గోల్ఫ్ క్లబ్ రిసార్ట్‌లోనే ఉన్నారని నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్‌ను ఊటంకిస్తూ ఫాక్స్ న్యూస్ నివేదించింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొంది.



# రన్ వేపై ఆగిపోయిన ఎయిర్ ఇండియా విమానం

దేశ రాజధాని ఢిల్లీ నుంచి విజయవాడ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం ఆలస్యం అయింది. ఎయిర్ ఇండియా ఎటువంటి కారణం చెప్పకుండా విమానాన్ని రన్ వే పైనే నిలిపివేసింది. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో బయలుదేరాల్సిన విమానం ఇంకా రన్ వే పైనే ఉండిపోయింది. విమానం టేక్ ఆఫ్ అవ్వడానికి సిద్ధమై ఆ వెంటనే రన్ వే పై ఆగిపోయింది. దాదాపు 3 గంటలు అవుతున్నా విమానం అక్కడినుంచి కదలలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో మండిపడుతున్నారు. విమానంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ కూడా ఉన్నారు. 164 మంది ప్రయాణికుల్లో కొంతమందికి డయాబెటిస్, ఇతర వ్యాధులు ఉన్నాయని.. వారికి ఆహారం, నీరు ఇవ్వాలని ఆయన విమాన సిబ్బందిని ఆదేశించారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు విమాన సిబ్బంది ప్రయాణికులకు ఆహారం, నీరు అందించారు. అయితే, సాంకేతిక సమస్యల వల్లే విమానం ఆగిపోయిందని ఎయిర్ ఇండియా చెబుతోంది. ప్రయాణికులు తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

### విమానంలో బొద్దింకలు.. సారీ చెప్పిన ఎయిర్ ఇండియా

అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం అనంతరం దేశీయ దిగ్గజ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఇటీవలే తరచూ వార్తల్లో నిలుస్తోంది. ప్రమాదం తర్వాత నుంచి సంస్థకు చెందిన పలు విమానాల్లో సాంకేతిక సమస్యలు, బాంబు బెదిరింపులతో నిత్యం వార్తల్లో నిలిచింది. తాజాగా ఆ సంస్థ మరోసారి హెడ్‌లైన్స్‌లో నిలిచింది. ఈసారి విమానంలో బొద్దింకలే అందుకు కారణం. శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబైకి వెళ్తున్న AI180 విమానంలో బొద్దింకలు కనిపించడంతో గందరగోళం నెలకొంది. వీటివల్ల ఇద్దరు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో క్యాబిన్ సిబ్బంది సదరు ప్రయాణికులను అదే క్యాబిన్‌లోని వేరే సీట్లకు మార్చారు. ఆ తర్వాత విమానం ఫ్యూయల్ ఫిల్లింగ్‌కోసం కోల్‌కతాలో ఆగినప్పుడు గ్రౌండ్ సిబ్బంది విమానాన్ని డీప్ క్లీన్ చేసినట్లు ఎయిర్ ఇండియా ప్రతినిధి తెలిపారు. సాధారణంగా తమ సిబ్బంది విమానాలను ఎప్పటికప్పుడు క్లీన్ చేస్తారని, అయితే కొన్నిసార్లు గ్రౌండ్ ఆపరేషన్ల సమయంలో కీటకాలు విమానంలోకి ప్రవేశిస్తాయని పేర్కొన్నారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



## దారి తప్పిన విమానం

రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మకు షాకింగ్ అనుభవం ఎదురైంది. ఆయన ప్రయాణిస్తున్న చార్టర్డ్ విమానం దారి తప్పింది. ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో ల్యాండ్ అవ్వాల్సిన విమానం పొరపాటున సివిల్ ఎయిర్‌స్ట్రిప్‌లో ల్యాండ్ అయింది. ఈ ఘటనకు పైలట్ల పొరపాటే కారణమని తేలింది. ఈ ఘటన గత గురువారం రోజు సాయంత్రం చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ గత నెల 31న ఢిల్లీ నుంచి ఫలోడికి చార్టర్డ్ 2000 ఫాల్కన్ విమానంలో ప్రయాణించారు. షెడ్యూల్ ప్రకారం ఆ విమానం ఫలోడి ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లోని ఎయిర్‌స్ట్రిప్‌లో ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, విమానం దానికి సమీపంలోని సివిల్ ఎయిర్‌స్ట్రిప్‌లో ల్యాండ్ అయ్యింది. పైలట్లు వెంటనే తప్పు గుర్తించి విమానాన్ని ఫలోడి ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే ఈ సంఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తీవ్రంగా స్పందించింది. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తునకు ఆదేశించింది.

## ఢిల్లీలో నడిరోడ్డుపై మహిళా ఎంపి చైన్ ను కొట్టేసిన స్నాచర్లు




ఓ మహిళా ఎంపి వాకింగ్ చేస్తుండగా ఆమె మెడలోని చైన్‌ను లాక్కెళ్లారు. ఈ సంఘటన ఢిల్లీలో చాణక్యపురిలో జరిగింది. తమిళనాడు రాష్ట్రానికి చెందని కాంగ్రెస్ ఎంపి సుధా రామకృష్ణన్, డిఎంకె నాయకురాలు రజతితో కలిసి పోలండ ఎంబసి సమీపంలో గేట్ 3 నుంచి గేట్ 4కు మార్నింగ్ వాక్ చేస్తున్నారు. ఇద్దరికి ఎదురుగా ఓ వ్యక్తి హెల్మెట్ పెట్టుకొని స్కూటీ మీద వచ్చారు. తన మెడలో గొలుసు చైన్ ను స్నాచర్ లాక్కొని పారిపోయాడు. మాకు ఎదురుగా బండిపై నిదానంగా వస్తుండడంతో తాము చైన్ స్నాచర్ అనుకోలేదని సదరు ఎంపి తెలిపారు. అతడు బలంగా గొలుసు లాగడంతో తన మెడపై గాయాలయ్యానని సుధా పేర్కొన్నారు. ఒంటిపై ఉన్న దుస్తులు కూడా కొద్దిమేర చినిగిపోయానని చెప్పారు. చైన్ స్నాచర్ లాగిన వెంటనే సహాయం కోసం ఎదురుచూశామని, ఎవరూ కనిపించలేదన్నారు. కొద్దిసేపటికి పెట్రోలింగ్ వాహనం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు. అత్యంత భద్రత కలిగిన ఎంపికే ఇలాంటివి జరిగితే సాధారణ మహిళల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దాదాపు మూడు తులాలన్నర బంగారు గొలుసు పోగొట్టుకున్నానని చెప్పారు.

## డ్రగ్స్‌పై హీరో కృష్ణసాయి పోరాటం



డ్రగ్స్‌పై యువతకు అవగాహన కల్పించాలని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందించిన హీరో కృష్ణసాయి పలు ప్రచార చిత్రాలను రూపొందిస్తున్నారు. కృష్ణ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్మాణంలో 'ఓ యువతా నీ గమ్యం ఎటు వైపు ?' అనే సందేశంతో రూపొందించిన ప్రచార వీడియోకు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా తెలుగు ఫిలిం ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో కృష్ణసాయి మాట్లాడుతూ.. 'తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు, మా బాధ్యతగా డ్రగ్స్‌పై ఓ చైతన్యపూరిత గీతాన్ని రూపొందించాం. గవర్నర్‌లు, పోలీస్ విభాగంతో పాటు, సామాజిక మాధ్యమాల్లోనూ ప్రశంసలు వెల్లువెత్తాయి. ప్రతి సినిమాకి ముందు 'స్మోకింగ్ డేంజర్' అని హెచ్చరికలు చేసే మెసేజ్ వలన యువతలో అవగాహన కలిగడంతో సిగరెట్, తంబాకు, గుట్కా వినియోగం బాగా తగ్గిపోయింది, సినిమా మాధ్యమం వల్ల ప్రజలు ప్రభావితం అవుతారు. అందుకే ఇప్పుడు డ్రగ్స్‌పై అవగాహన పెంచేందుకు మేం రూపొందించిన పాట 'డేంజర్' అనే సినిమాలోనిది. ఈ సినిమా యువతను మార్పు దిశగా నడిపిస్తుందని నమ్మకం ఉంది' అని అన్నారు.



## ఒత్తిడితో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

అర్థం కాని చదువుతో సతమతం అవుతున్నానని, ఈ చదువు తనతోకాదని, చెల్లినైనా నచ్చిన కోర్సులో జాయిన్ చేయించి మంచిగా చదివించండంటూ తల్లితండుల్రకు సూసైడ్ నోట్ రాసి ఇంటర్ విద్యార్థిని తరగతి గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన అదివారం హనుమకొండలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో చోటు చేసుకుంది. హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన మిట్టపల్లి కుమార్- కవిత దంపతులు.. వారి పెద్ద కూతురు శివాని(16)ని హనుమకొండలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం జేఈఈ బ్యాచ్‌లో జాయిన్ చేశారు. అయితే శివానికి మాత్రం ఎంసెట్ బ్యాచ్‌లో కొనసాగాలని ఉన్నప్పటికీ తల్లిదండ్రుల కోరిక మేరకు జేఈఈ మెయిన్స్ కోర్సులో జాయిన్ అయింది. ఆమెకు జేఈఈ తరగతులు అర్థం కాకపోవడంతో అదివారం ఉదయం కళాశాల మూడో అంతస్థులోని తరగతి గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన సహచర విద్యార్థిని.. కళాశాల యాజమాన్యానికి సమాచారం చేరవేయడంతో హుటాహుటినా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతిచెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. కాగా, ఇష్టం లేని కోర్సులో ఇమడలేకపోతున్నానని, ఇక చావే దిక్కు.. అని, చెల్లినైనా మంచిగా చదివించండంటూ రాసుకున్న సూసైడ్ నోట్ మృతురాలి లాకర్‌లో లభ్యమైంది. తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు.



## మాళవిక హాట్ లుక్స్

హీరోయిన్ మాళవిక మోహనన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇన్నాళ్లు తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఇప్పుడు రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కాబోతుంది. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో రాబోతున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. అయితే ఓ సినిమా కోసం మాళవిక కేవలం రెండు వారాల్లోనే 8 కిలోల బరువు పెరిగిందట. అంతకు ముందు 14 రోజుల్లోనే బరువు తగ్గింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక.. తన ఫిట్నెస్ సిక్రెట్ రివీల్ చేసింది. ఒక సినిమాలో తన పాత్ర కోసం కేవలం 14 రోజుల్లోనే 8 కిలోల బరువు తగ్గిందట. అది తనకు చాలా కష్టమైన దశ అని చెప్పుకొచ్చింది.తక్కువ కేలరీలు ఉన్న ఆహారం తీసుకున్నానని.. అదే సమయంలో శారీరకంగా చాలా కష్టపడి స్టంట్స్,

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# తిరుమలలో కిరణ్ అబ్బవరం కొడుకు నామకరణం

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవలే తన భార్య, నటి రహస్య గోరక్ పండంటి మగబిడ్డకి జన్మించిన సంగతి తెలిసిందే. తొలిసారి బాబుతో తిరుమల శ్రీవారిని దర్శించుకుని, అక్కడే నామకరణ సంబరాలు నిర్వహించారు. తిరుమలలో సోమవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఈ కుటుంబానికి ఆలయ అధికారులు వేద ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు, పట్టు వస్త్రాలతో సత్కరించారు. దర్శనం తర్వాత కిరణ్ మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలకి తొలిసారి మా బాబుతో వచ్చాం. ఇక్కడే నామకరణం చేశాం. మా కొడుక్కి 'హను అబ్బవరం' అనే పేరు పెట్టాం. ఇది నాకు ఒక జీవిత కాలం గుర్తుండే క్షణం. శ్రీవారి దీవెనలతో మా కుటుంబం ఆనందంగా ఉంది అన్నారు.





# రాహుల్‌పై పరువునష్టం కేసులో సుప్రీం స్టే

భారత భూభాగాన్ని చైనా ఆక్రమించిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. మీరు నిజమైన భారతీయులే అయితే ఇలాంటి మాటలు మాట్లాడరని ఘాటు వ్యాఖ్యలు చేసింది. 'చైనా మన దేశ భూభాగాన్ని ఆక్రమించింది' అని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై దాఖలైన కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పై వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణ చేపట్టింది. 'మీరు ప్రతిపక్ష నేత. పార్లమెంటులో చెప్పాల్సిన విషయాలను సోషల్ మీడియాలో ఎందుకు ప్రస్తావిస్తారు? ౨,000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని మీకు ఎలా తెలుసు?' అని రాహుల్ గాంధీని ఉద్దేశించి ధర్మాసనం ప్రశ్నించింది. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన విషయాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వార్నింగ్ ఇచ్చింది. దాంతో రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. లక్నో కోర్టులో జరుగుతున్న విచారణపై స్టే విధిస్తూ రాహుల్ గాంధీకి తాత్కాలిక ఊరటనిచ్చింది. అయితే రాహుల్ గాంధీ వ్యాఖ్యలను మాత్రం మాత్రం తీవ్రంగా తప్పుబట్టింది. జాతీయ నాయకులు బాధ్యతాయుతంగా ఉండాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది.







# 'రంగస్థలం' పాటకు మించిన స్పెషల్ సాంగ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న పీరియాడిక్ డ్రామా పెద్ది. ఫస్ట్ గ్లింప్స్‌తోనే మంచి అంచనాలు అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. అయితే ఈ సినిమా ఉత్తరాంధ్ర నేపథ్యంలో కనిపించనున్న సంగతి అందరికీ తెలిసిందే. మరి దీనికి అనుగుణంగానే బుచ్చిబాబు మంచి ట్రీట్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నాడట. గతంలో రంగస్థలం సినిమాకి జిగేలు రాణి ఎలాంటి హైలైట్ అయ్యిందో ఇప్పుడు ఇదే రీతిలో శ్రీకాకుళంకి చెందిన ఓ ఫేమస్ ఫోక్ సాంగ్‌ని మేకర్స్ రీమిక్స్ చేస్తున్నట్టుగా తెలిసింది. శ్రీకాకుళం జానపద గేయం మా ఊరి ప్రెసిడెంటు అనే సాంగ్‌ని మేకర్స్ రీమిక్స్ చేయగా ఈ సాంగ్‌ని ప్రముఖ జానపద గాయకులు, రచయిత పెంచల్ దాస్ ఆలపించినట్టుగా సమాచారం. మరి ఈ ఫోక్ సాంగ్‌కి రెహమాన్ టచ్ ఇస్తే ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

# హాట్ దిశా

తెలుగులో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కానీ ఆతర్వాత టాలీవుడ్ కు దూరం అయ్యారు. తెలుగులో కొన్ని సినిమాలే చేసి ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసినవారు చాలా మంది ఉన్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకటి రెండు సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. పెళ్లి చేసుకొనో.. లేక అవకాశాలు లేక సినిమాలకు దూరం అయ్యారు. ఒక ముద్దుగుమ్మ తెలుగులో రెండే సినిమాలు చేసింది. అందులో ఒకటి డిజాస్టర్ కాగా ఓ సినిమా సంచలన విజయం సాధించింది. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ మాత్రం లేదు. ఇప్పుడు ఒకొక్క సినిమాకు రూ. 3 కోట్లు వసూల్ చేస్తుంది ఈ చిన్నది. అలాగే ఆమె ఆస్తి పాస్తులు కూడా కోట్లల్లో ఉన్నాయి. అంతే కాదు ఇండస్ట్రీలో ఆమెను మించిన హాట్ బ్యూటీ లేదు.







## కాంతార 3లో జూనియర్ ఎన్టీఆర్?

హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందిన కాంతార చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ మూవీ సాధించిన విజయంతో ఇప్పుడు కాంతార ప్రీక్వెల్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. రిషబ్ శెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రీక్వెల్ షూటింగ్ ఇప్పటికే పూర్తి కాగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అక్టోబర్ ౨న సినిమా రిలీజ్ కానుంది. ఈ సమయంలో 'కాంతార 3'కి సంబంధించిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈసారి కథని మరో లెవెల్‌కు తీసుకు వెళ్లాలనుకుంటున్న రిషబ్ శెట్టి, విభిన్నమైన కథాంశాన్నిఎంచుకున్నట్టు సమాచారం. అంతేకాకుండా ప్రాజెక్ట్‌లోకి తెలుగు స్టార్ హీరోని కూడా తీసుకోవాలని అనుకుంటున్నాడట. ఇప్పటికే హోంబలే ఫిల్మ్స్ పాన్ ఇండియా లెవెల్‌కి తమ సినిమాలను తీసుకెళ్లడంలో బిజీగా ఉండగా, 'కాంతార 3'లో ప్రత్యేకమైన కాంబోని సెట్ చేస్తుందనే టాక్ వినిపిస్తుంది. ఈ క్రమంలో కాంతార3లో ఎన్టీఆర్‌ని ఓ కామియో పాత్రకి తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నారట. ఇదే నిజమైతే మాత్రం ఫ్యాన్స్ కి పూనకాలు గ్యారెంటీ. అంతేకాదు ఇండియన్ సినిమా స్థాయిలో ఓ బ్లాక్‌బస్టర్ అప్‌డేట్ అవుతుందని అభిప్రాయపడుతున్నారు.

## ఆళ్లగడ్డలో దొంగల బీభత్సం

ఆళ్లగడ్డ పట్టణంలోని బొరుగుల బట్టీ వీధిలో ఆదివారం రాత్రి దొంగలు బీభత్సం చేశారు. బండల వ్యాపారం చేసుకుంటున్న సంజీవ రాయుడు ఇంట్లో బీరువా పగలగొట్టి కూతురు పెళ్లి కోసం దాచుకున్న రూ.4.50 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం దోచుకున్నారు. కుటుంబ సభ్యులు చర్చికి వెళ్లిన సమయంలో ఈ చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేస్తున్నారు.



## అసెంబ్లీ ఆవరణలోని గాంధీ విగ్రహం ముందు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల మెరుపు ధర్నా

అసెంబ్లీ ఆవరణలోని గాంధీ విగ్రహం ముందు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మెరుపు ధర్నా నిర్వహించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వేటు వేయాలని నినాదాలు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును త్వరతగతిన నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలవడానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల బృందం శాసనసభ కార్యాలయానికి వెళ్లింది. అయితే స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో అసెంబ్లీ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యేలు నిరసనకు దిగారు. పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలను డిస్క్వాలిఫై చేయాలని నినానాదాలు చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కాగా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ధర్నాను కవర్ చేయకుండా మీడియాను పోలీసులు అడ్డుకున్నారు. శాసనసభ ఆవరణలో మీడియా ఆంక్షలు ఉన్నాయని చెప్పారు. మీడియా ప్రతినిధులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది.



## నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లు

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసే నేరగాళ్ల సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. విద్యావంతులైనప్పటికీ, నిరుద్యోగుల ఆశలను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా మెదక్ జిల్లాలో ఓ యువకుడు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయాడు.మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన యువకుడి నుంచి సైబర్ నేరగాళ్లు విడతల వారీగా రూ.౨ లక్షలు కాజేశారు. 'వర్క్ ఫ్రమ్ హోమ్' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో సైబర్ నేరగాళ్లు ప్రకటన పెట్టారు. కొద్ది మొత్తం పెట్టుబడి పెడితే ఉద్యోగంతో పాటు లాభాలు కూడా వస్తాయని నమ్మబలికారు. దీంతో ఆకర్షితుడైన యువకుడు మోసగాళ్ల మాటలు నమ్మి, విడతల వారీగా రూ.౨ లక్షలు చెల్లించాడు. చివరికి మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనతో విషయం వెలుగులోకి వచ్చింది.